ఎఒబిలో బ్యానర్ల కలకలం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లా ఎఒబి ప్రాంతంలో గురువారం ఉదయం మావోయిస్టులకు సంబంధించిన బ్యానర్లు కనిపించడంతో కలకలం రేగింది. పార్వతీపురం సరిహద్దులో ఉన్న నారాయణపట్నం సమీపంలో మావోయిస్టు బ్యానర్ కనిపించడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ బ్యానర్లో చిస్గాడ డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శ్రీకాకుళం డివిజన్ పేరిట బ్యానర్ కన్పించింది. దీంతో ఏవోబీలో మళ్లీ ఉద్రిక్తతలు రేగుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు నిజంగా ఈ బ్యానర్ మావోయిస్టులు ఏర్పాటు చేశారా? ఇంకెవరైనా పెట్టారా? అనే విషయమై ఒడిశా పోలీసులు ఆరా తీస్తున్నారు.

మహారాజశ్రీ ముఖ్యమంత్రి గారికి..

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు గిరిజనులు వ్రాసుకున్న విన్నపములు

అయ్యా...

మీరు అధికారంలోకి రాకముందు చేపట్టిన పాదయాత్ర సందర్భంగా సాలూరు పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో అనేక విషయాలు చెప్పారు. గిరిజన యూనివర్సిటీని సాలూరు ఏజెన్సీ ప్రాంతంలోనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న కొత్తవలస సమీపంలో రెల్లి గ్రామం వద్ద స్థలం గుర్తించి శంకుస్థాపన చేశారు. ప్రహరీ కూడా నిర్మించింది. తర్వాత గిరిజన ప్రాంతంలో ఉండాలనే ఉద్దేశంతో పాచిపెంట మండలంలోని మోసూరు ప్రాంతంలో ఉన్న మాన్సాస్ భూములను పరిశీలించింది. ముగ్గురు మంత్రుల బృందం ఈ ప్రాంత భూములను పరిశీలించిన తర్వాత ప్రత్యేక కారణాల రీత్యా ఇక్కడ పనికి రాదని నిర్ణయించారు. ఆ తర్వాత సాలూరు నియోజకవర్గం లో ఏర్పాటు కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారుల బృందం దుగ్గ సాగరం భూములను పరిశీలించింది. రామభద్రపురం, సాలూరు మండలాల సరిహద్దు ప్రాంతంలో భూములను అధికారులు, అప్పటి ఎమ్మెల్యే, మంత్రులు పరిశీలించారు. కానీ ఈ భూములు అనువుగా లేవని కమిటీ సభ్యులు నిరాకరించినట్లు తెలుస్తోంది. వాస్తవంగా చెప్పాలంటే ఈ భూములు యూనివర్సిటీ ఏర్పాటు కు అనుకూలం గా ఉన్నవే. సాలూరు పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ భూములను కాదని 40కిలోమీటర్ల దూరంగా భూములను ఎంపిక చేశారు. ఆ భూములు మెంటాడ, దత్తిరాజేరు మండలాల పరిధిలో ఉన్నాయి. ఆ రెండు మండలాలు ప్రస్తుతం విజయనగరం జిల్లాలో వున్నాయి. అయితే మెంటాడ మండలం సాలూరు నియోజకవర్గంలో ఉన్నందున పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నట్టు నమ్మబలుకుతున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు మీ పార్టీ పెద్దలు ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు మీరు శంకుస్థాపన చేయబోతున్న భూములున్న ప్రాంతం పూర్తిగా విజయనగరం జిల్లాలోనే ఉంది. మెంటాడ మండలం సాలూరు నియోజకవర్గంలో ఉందనే సాకు చూపి పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నట్టు మన్యం జిల్లా గిరిజనులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మీరు ఇచ్చిన మాటకు విరుద్ధంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు జరుగుతోంది. దీని వెనుక చాలా కారణాలు ఉన్నాయి.

మీకు తెలుసా...

ఈనెల 25న గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు సాలూరు నియోజకవర్గానికి మీరు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి వస్తున్నందుకు సంతోషంగా ఉంది. సాలూరు నియోజకవర్గంలో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన కోసం వస్తున్నారని భావించవచ్చు. కానీ మీరు శంకుస్థాపన చేయనున్న ప్రదేశం విజయనగరం జిల్లా లో ప్రస్తుతానికి ఉంది. అంటే మన్యం జిల్లాకు అన్యాయం చేస్తున్నట్లేనని మేం భావిస్తున్నాం. ఇప్పటికీ విద్య, వైద్య సౌకర్యాలకు చాలా గిరిజన గ్రామాలు దూరంగా వున్నాయి. కనీస రహదారి సౌకర్యం లేని గిరిశిఖర గ్రామాలు ఎన్నో వున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గిరిజన యూనివర్సిటీ సాలూరు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి అవకాశం. పది, ఇంటర్మీడియెట్ చదువుతో ఆపేసిన గిరిజన యువకులు వేలాది మంది ఈ ప్రాంతంలో ఉన్నారు. గిరిజనులు మిగిలిన వర్గాల మాదిరిగానే ఉన్నత విద్యను అభ్యసించాలంటే గిరిజన యూనివర్సిటీ అందుబాటులో వుంటుందని మేం భావించాం. సాలూరు ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటవుతుందని ఎన్నో కలలు కన్నాం. కానీ మీ పార్టీ పెద్దల నిర్ణయాల కారణంగా మా ఆశలు అడియాశలు కానున్నాయి.

రియల్ ఎస్టేట్ మాఫియా వల్లనే

గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో గానీ, ఇప్పుడు మీ ప్రభుత్వం హయాంలో గానీ గిరిజన యూనివర్సిటీ ఏజెన్సీ ప్రాంతానికి దూరంగా వెళ్లడానికి ప్రధాన కారణం రియల్ ఎస్టేట్ మాఫియా. గతంలో కొత్తవలస చుట్టూ భూములు కొనుగోలు చేసిన టిడిపి మాజీ మంత్రులే యూనివర్సిటీ అక్కడ ఏర్పాటుకు ప్రయత్నించారు. ఇప్పుడు కూడా మెంటాడ, దత్తిరాజేరు మండలాల సరిహద్దు ప్రాంతంలో యూనివర్సిటీ ఏర్పాటు వెనుక కూడా రియల్ ఎస్టేట్ లాబీయింగ్ బలంగా పని చేసినట్లు తెలుస్తోంది. అధికారపార్టీ కి చెందిన కొంతమంది కీలక నేతలు, ఎమ్మెల్యేలకు యూనివర్సిటీ ఏర్పాటు చేయబోయే భూముల చుట్టూ వేలాది ఎకరాల భూములు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రియల్ ఎస్టేట్ ముసుగులో అధికారపార్టీ నాయకులే గిరిజన యూనివర్సిటీని సాలూరు ప్రాంతంలో లేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మీరు చేయబోయే శంకుస్థాపన మా ప్రాంత అభివృద్ధిని ఫణంగా పెట్టి అభివృద్ధి చెందిన జిల్లాను మరింత అభివృద్ధి చెందడానికి వేస్తున్న పునాది రాయిలా మేం భావిస్తున్నాం. నిశితంగా పరిశీలించి వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతానికి గిరిజన యూనివర్సిటీని బహుమతి గా ఇస్తారని కోరుతున్నాం.

ఇట్లు
సాలూరు నియోజకవర్గ ప్రజలు

సిఎం పర్యటనకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు బొత్స, రాజన్నదొర

ప్రజాశక్తి-దత్తిరాజేరు

జిల్లాలోని దత్తిరాజేరు, మెంటాడ మండలాల పరిధిలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ముఖ్య అతిథిగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, పి.రాజన్నదొర, వైసిపి ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి వైవి సుబ్బారెడ్డి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, జెసి అశోక్ పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు గత నాలుగు రోజులుగా తీవ్ర కృషి చేస్తున్నారు. మెంటాడ మండలం చిన మేడపల్లి రెవెన్యూ పరిధిలో శంకుస్థాపన కోసం శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. శంకుస్థాపన అనంతరం దత్తిరాజేరు మండలం మరడాం గ్రామం జాతీయ రహదారి ప్రక్కన సభా ప్రాంగణం ఏర్పాటు చేశారు. సిఎం సభను జయప్రదం చేసేందుకు అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని వైవి సుబ్బారెడ్డి అన్నారు. వారి వెంట గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఉన్నారు.

నాలుగు కిలోమీటర్ల కే రెండు హెలీప్యాడ్లు

ముఖ్యమంత్రి సభా ప్రాంగణం వద్ద హెలీప్యాడ్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్లు రోడ్డు మార్గంలో వెళ్లి చినమేడపల్లి వద్ద శంకుస్థాపన చేసేందుకు వీలుగా తొలుత అధికారులు చర్యలు చేపట్టారు. సభా స్థలం మరడాం నుండి నాలుగు కిలోమీటర్లు చకచకా తారు రోడ్డు కూడా వేశారు. బుధవారం రాత్రి ముఖ్యమంత్రి సెక్యూరిటీ నిఘా వర్గం ఆదేశాల మేరకు రోడ్డు మార్గం బాగోలేదని ఆదేశించడంతో గురువారం శంకుస్థాపన స్థలం వద్ద అప్పటికప్పుడు 10 ఎకరాల స్థలంలో చెట్లను తొలగించి చదును చేసి మరో హెలిప్యాడ్ తయారు చేశారు. విశాఖపట్నం నుండి నేరుగా శంకుస్థాపన స్థలం వద్దకు హెలికాప్టర్లో చేరుకొని శంకుస్థాపన అనంతరం తిరిగి హెలికాప్టర్లో మరడాం వద్ద హెలిప్యాడ్ వద్ద కు చేరుకుంటారు.

అధికారులతో చర్చిస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, రాజన్నదొర

సభా ప్రాంగణం అంతా పోలీసులే

ముఖ్యమంత్రి సభా ప్రాంగణం వద్ద కట్టు దిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం వద్ద ఎటు చూసినా పోలీసులు మోహరించారు.

అర్హులైన లబ్ధిదారులకు పథకాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి సిఎం ప్రారంభించిన నవరత్నాలు ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమానికి కలెక్టరు కార్యాలయం నుండి జిల్లా కలెక్టరు, లబ్దిదారులు వర్చువల్‌గా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు జిల్లాలో 3915 మంది లబ్దిదారులకు మంజూరు చేసిన రూ.3.99 కోట్లు చెక్కును లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ నవరత్నాల పథకాలకు అర్హులై ఉండి, అవసరమైన ధ్రువపత్రాలు పొందలేక, సాంకేతిక కారణాలతో పథకాలు పొందలేకపోయిన, కొత్తగా అర్హత పొందిన లబ్దిదారులకు మళ్లీ దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించి వారికి ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకొకసారి ప్రభుత్వ పథకాలు మంజూరు చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. జిల్లాలో అటువంటి లబ్దిదారులను గుర్తించి, వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా అందించి 253 మందికి అమ్మఒడి, 1267 మందికి చేదోడు, 30 మందికి ఇ.బి.సి. నేస్తం, 1852 మందికి వసతి దీవెన, 353 మందికి ఆసరా, 113 మంది రైతులకు పథకాలు మంజూరు చేసి ముఖ్యమంత్రి నేరుగా బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లోనికి నిధులు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, లబ్దిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఐటిడిఎకు శిక్షణ ఐఎఎస్‌ల బృందం రాక

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎకు శిక్షణలో ఉన్న ఐఎఎస్‌ల బృందం రానుందని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన 14 మందితో కూడిన ట్రైనీ ఐఎఎస్‌ల బృందం జిల్లాలోని సీతంపేట, భామిని మండలాల్లో పర్యటించనుందన్నారు. 14 మంది శిక్షణ ఐఎఎస్‌లు 2 బృందాలుగా ఏర్పడి, ఒక బృందం సీతంపేట మండలంలో పూతికవలస, రెండవ బృందం భామిని మండలంలో బొడ్డగూడ గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. సెప్టెంబర్ 2వ తేదీ వరకు వారం రోజుల పాటు వీరు ఆయా గ్రామాల్లో పర్యటించి గిరిజనుల జీవన విధానాలు, వారి ఆర్థిక, సామాజిక స్థితగతులు, వారి సంస్కృతిక సాంప్రదాయాలపై అధ్యయనం చేస్తారని తెలిపారు. గిరిజన గ్రామాల్లో జరిగిన భూ సంస్కరణలు, పీసా చట్టం అమలు, వ్యవసాయ విధానాలు, గిరిజన కళలు, యువతకు ఉపాధికల్పన, విద్యావిధానాలు, గిరిజనుల ఆరోగ్య పరిస్థితులు, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకొనే జాగ్రత్తలు వంటి వాటిపై అధ్యయనం చేస్తారని తెలిపారు. ఈ బృందంలో 9 మంది పురుషులు, 5 గురు మహిళలు ఉన్నట్లు తెలిపారు. వీరికి భామినిలో వసతి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. రెండు బృందాలకు లైజనింగ్ అధికారులుగా సీతంపేట ఎటిడబ్ల్యుఒ మంగవేణి, పిఎంఆర్‌సి ఎఎంఒ కోటిబాబులు వ్యవహరిస్తారని వెల్లడించారు.

భామిని: ఈ నెల 27 నుండి సెప్టెంబర్ 2 వరకు 5 రోజులు పాటు 14 మంది ట్రైనీ ఐఎఎస్‌లు క్షేత్ర స్థాయిలో పలు గిరిజన గ్రామాలు పర్యటించనున్నారు. ఇందులో భాగంగా వసతి నిమిత్తం భామినిలో ఇటీవల కొత్తగా నిర్మించిన గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహం అదనపు భవనాలును ఐటిడిఎ పిఒ కల్పన కుమారి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఐటిడిఎ డిడి శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎన్. అప్పారావు, ఆర్ఐ రాంబాబు వున్నారు.

పార్వతీపురం, సాలూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రక్తహీనత నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

బాలికలు, గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, జాయింటు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, శిశు సంక్షేమం తదితర శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని, గర్భిణులకు నిరంతరం సేవలు అందించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సర్వే నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేయాలని తెలిపారు. పౌష్టికాహారం పంపిణీ, నాడు నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ బాలికలు, గర్భిణులు, చిన్నపిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకొని, రక్తహీనత ఉన్నవారిని గుర్తించి వారి వివరాలు సచివాలయానికి తెలియజేసి మందులు, పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ, వైద్యశాఖ, మాతాశిశు సంక్షేమ శాఖల సిబ్బందిని సమన్వయపరుస్తున్నట్లు తెలిపారు.

సకాలంలో రీసర్వే పనులు పూర్తి చేయాలి

రీసర్వే పనులు సకాలంలో పూర్తిచేసి, సరిహద్దురాళ్ల ప్లాంటేషన్ చేయడం జరుగుతుందని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. గురువారం సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లు, జాయింటు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వేపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రీసర్వే, తహశీల్దారు లాగిన్ పెండింగు, అసైన్డ్ భూముల గుర్తింపు, ఫైనల్ ఆర్ఒఆర్, స్టోన్ ప్లాంటేషను తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, ఇన్‌ఛార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.భాస్కరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, సిపిఒ పి.వీరరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉమ్మడి విజయనగరం జిల్లా పర్యటన నిమిత్తం మెంటాడ మండలం వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి దృష్టికి మండలంలోని జీగిరాం వద్ద గల జ్యూట్‌మిలు కార్మికుల సమస్యలను పరిష్కారానికి జిల్లా మంత్రులు తీసుకెళ్లి పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. మిల్లు తెరిపించి, కార్మికులందరికీ పని కల్పించాలని కోరుతూ చేపట్టిన రిలేనిరాహారదీక్షలు గురువారం మూడోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు సాలూరు నుంచి జ్యూట్ మిల్లు వరకూ ఫెడరేషన్ ఆధ్వర్యాన బైక్ ర్యాలీ నిర్వహించి, దీక్షలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ శిబిరాన్ని ఉద్దేశించి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాయుడు, పట్టణ అధ్యక్షులు పి రాముడు, శ్రామిక మహిళ నాయకులు పి ఇందు, మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఏకైక జూట్ మిల్లును తెరిపించడంలో పాలకులు విఫలమయ్యారని, 15నెలలుగా జ్యూట్ మిల్లు మూతపడ్డా తెరిపించడానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడం అంటే ప్రజల సమస్యలును పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రజా సమస్యల పట్ల పాలకులు, అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో ఈ సమస్య తెలియజేస్తుందన్నారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్న సిఎం దృష్టికి జ్యూట్‌మిల్లు సమస్యను ఇప్పటికే ఎపి ఫైబర్స్ జెఎసి ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టిలో పెట్టినందున జిల్లా మంత్రులు, కలెక్టర్ తీసుకువెళ్లి యాజమాన్యంతో చర్చించి, మిల్‌ను తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే జూట్ మిల్లు కార్మికుల జెఎసి చేపట్టబోయే భవిష్యత్తు పోరాటాలకు కార్మిక వర్గం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు స్వప్న, సీత, పోలిరాజు, విశ్వేశ్వరరావు ,శ్రీను, మాధవ, గోవింద పాల్గొన్నారు. మూడవరోజు దీక్షల్లో మహిళా సభ్యులు గేదెల రాజేశ్వరి, బొప్పడాల సరస్వతి, బాబిరెడ్డి శాంతి, బంకురు పుష్ప, నగిరెడ్డి సావిత్రమ్మ, జెఎసి నాయకులు శ్రీనివాసరావు, సూరప్పలనాయుడు, రామారావు, సత్యనారాయణ, సింహాచలం పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై నిరసనలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కార్మికులను ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధం చేయడం సరైన పద్ధతి కాదని ఈ అక్రమ అరెస్టులను ప్రతి ఒక్కరు ఖండించాలని సిఐటియు జిల్లా నాయకులు అన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గురువారం తలపెట్టిన చలో అసెంబ్లీకి బయలుదేరిన కార్మిక సంఘ నాయకులను, కార్మికులను గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడానికి నిరసనగా మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహిస్తూ ఆర్టీసీ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోరుతూ అనేక రూపంలో ప్రభుత్వానికి, అధికారులకు సుదీర్ఘకాలంగా తెలుపుతున్నప్పటికీ స్పందించడంలేదన్నారు. ఇందులో భాగంగా గురువారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేసేందుకు వెళ్తున్న మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం పోలీసులచే నిర్బంధించడం అన్యాయమని అన్నారు. మున్సిపల్ ఆప్కాస్ విధాన పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ వర్కర్స్, క్లాప్ ఆటో డ్రైవర్ సమస్యలు పరిష్కరించాలని, కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర పట్టణ నాయకులు బంకూరు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాకల సన్యాసిరావు, సంచాన ఉమా, కార్మికుల జిల్లా అధ్యక్షులు నాగవంశం శంకర్రావు, నాగవంశం మల్లేష్ ,మామిడి శివ, నాగవంశం నిర్మల, గంగయ్యలు,పడాల గాంధీ, నరేష్ ,గౌరమ్మ, ఇప్పలమ్మ,లక్ష్మి సుజాత మరియు మేస్త్రీలు డ్రైవర్లు వాటర్ సెక్షన్ కార్మికులు పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయకపోతే సమ్మెకు దిగనున్నామని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు హెచ్చరించారు. ఛలో విజయవాడ కార్యక్రమానికి మద్దతుగా పట్టణం మున్సిపల్ కార్మికులు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బయలు దేరిన ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా సాగింది. అనంతరం యూనియన్ బ్యాంక్ జంక్షన్ లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్వైనాయుడు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. కార్మికులకు సబ్బులు, నూనెలు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కమిటీ కన్వీనర్ టి.ఇందు, ఫెడరేషన్ పట్టణ నాయకులు టి.శంకరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందర్నీ వెంటనే పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్కు, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో విజయవాడలో మహా ధర్నా జరుగుతున్న సందర్భంగా పాలకొండలో మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు పడాల భాస్కరరావు, చింతల సురేష్, శ్రీదేవి, విమల, రఘు, వండాన ఆంజనేయులు, భోగి విష్ణు, టి ఈశ్వర్, పి శ్రీనివాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో మానవహారం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మళ్లీ అధికారం మాదే

గడప గడపకు ముగింపు కార్యక్రమంలో బొత్స

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రంలో మళ్లీ వైసిపి ప్రభుత్వమే కొలువు తీరుతుందని, జగన్మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు రాష్ట్రంలోనే మొదటి సారిగా పూర్తి చేసిన సందర్భంగా గురువారం స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన విజయోత్సవ భారీ బహిరంగ సభకు బొత్స ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చడమే కాక, సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి వాలంటీర్ల ద్వారా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించారన్నారు. కానీ చంద్రబాబు నాయుడు, లోకేష్ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. చంద్రబాబు, లోకేష్‌తో పాటు పలువురు టిడిపి నాయకులు ముఖ్యమంత్రిని, మంత్రులను దుర్భాషలాడుతూ విమర్శిస్తున్నారని, ఒక్కసారి ఆత్మ విమర్శన చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యేలంతా రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కష్టపడి పనిచేయాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు నియోజక వర్గాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు పనిచేస్తూ కష్టపడుతున్నారని, కులం, మతం,ప్రాంతం, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేస్తూన్నారని. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, నియోజకవర్గ పరిశీలకులు శోభ హైమావతి, జిల్లా వ్యవసాయ సంఘం చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ లు, బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం ఎంపీపీలు, జడ్పిటిసిలు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

పలు వార్డుల్లో కమిషనర్ పర్యటన

పాలకొండ : పట్టణంలో కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు 1, 2, 20 వార్డుల్లో ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి పర్యటించి వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించారు. లైట్లు వెలగని ప్రాంతాలను గుర్తించి వీధి దీపాలను తక్షణం రిపేర్ చేయించి వెలిగేలా చూడాల్సిందిగా అసిస్టెంట్ ఇంజనీర్ కి, లైటింగ్ సిబ్బందికి ఆదేశించారు. ప్రతిరోజు అన్ని సచివాలయాల్లో సాయంత్రం సమయంలో పర్యటించి వ్రీధి దీపాల సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఇందుపై ఎమినిటీ సెక్రటరీలకు కూడా ఆదేశాలు జారీ చేశారు.

స్లోన్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

మురుగు కాలువలు నిర్మించండి

ప్రజాశక్తి- పాలకొండ

జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు, కూరంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మురికి కాలువ సమస్య పై సబ్ కలెక్టర్ నురుల్ కమర్‌కు గురువారం అతని కార్యాలయంలో వినతి పత్రం అందించారు. పాలకొండ పట్టణంలో వడమ కాలనీలో చెరువుకు ఆనుకొని తూర్పు భాగంలో ఉన్న 7వ వార్డులో ఉన్న సాయి ఇంటి దగ్గర నుండి నివసిస్తున్న ఇళ్ల నుండి వచ్చే మురుగు నీరు, వర్షం నీరు కాలువ లేని కారణంగా అక్కడ మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో ఆ వీధిలో, ఉన్న ప్రజలు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. దోమల సమస్య కూడా తీవ్రంగా ఉండటంతో ప్రజలు అనారోగ్య పరిస్థితులు ఎక్కువ అవుతున్నాయన్నారు. అంగన్వాడీ బిల్డింగ్ కూడా మునిగిపోయినందున వేరే దగ్గర బిల్డింగ్ అద్దెకు తీసుకుని అంగన్వాడీ సెంటర్ నడుపుతున్నారన్నారు. ఇక్కడ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సబ్ కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సత్తిబాబు కోరారు.

స్లోన్ ప్లాంటేషన్‌ను సబ్ కలెక్టర్ పరిశీలన

పాలకొండ రూరల్: మండలంలోని సింగన్నవలస గ్రామంలో స్లోన్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. స్లోన్ ప్లాంటేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సింగన్నవలస గ్రామ పరిధిలో కొత్తగా నిర్మించిన ఎంపిఎఫ్‌సి గోడౌన్ తనిఖీ చేశారు.

టిటుకుపాయిలో గడపగడపకు

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని టిటుకుపాయి సచివాలయం పరిధిలో టిటుకుపాయి, మానాపురం, కుసుమూరు, టిటుకుపాయిగూడ, పాతమానాపురం, కొత్తకోట, మానాపురం, పనసమానుగూడలో గ్రామాలలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, ఎంపిపి చైర్మన్ హిమరిక మోహన్ రావు, టిటుకుపాయి సర్పంచ్ నిమ్మక అరుణ, మానాపురం సర్పంచ్ బి.లక్ష్మి, చంద్ర శేఖర్, వెంకటేష్, కాష్టారావు, తవిటిరాజు, గంగారావు, రాము, కేశవ రావు, అనప, సన్యాసిరావు, అప్పారావు, వెంకు నాయుడు, సోమేశ్వర రావు, రామారావు, ఆరిక కుమారి, కిల్లక కాంతారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులు అన్నింటిలోనూ ముందుండాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

చదువుతోపాటు వివిధ రంగాలలో మేమున్నామని నిరూపించు కోవాలని పాలకొండ డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి ఆర్ విజయకుమారి విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వికలాంగుల ఆటల పోటీలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీనియర్ విభాగంలో అండర్ 12 -14, జూనియర్ విభాగంలో అండర్ 6-11 రన్నింగ్, బేస్ బాల్, షార్ట్ పుట్, డిస్కో త్రో, స్లో వాక్ వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక విద్యాశాఖాధికారి ఆనందరావు, జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ సుంబోరా, కెపి నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ ఉమామహేశ్వరరావు, ఎస్ పద్మరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన గిరిజన నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ మంత్రి పుష్పశ్రీవాణిలను ఎస్‌టి సెల్ జిల్లా కన్వీనర్ కొండగొర్రి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో గిరిజన యువజన నాయకులు గురువారం కలిశారు. చినమేరంగిలో శత్రుచర్ల నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. జిల్లాలో ఎస్‌టి సెల్ విభాగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పరీక్షిత్ రాజు హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో గిరిజన నాయకులు ముఖ్యల అశోక్, అన్నారావు, నారాయణ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పార్వతీపురంపట్టణం

పట్టణంలో జగన్నాధపురంలో గల సమస్యలను పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలిరెడ్డి జగదీష్, వావిలపల్లి సూర్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కమిషనర్ జె. రామ అప్పలనాయుడును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగన్నాధపురం పరిధిలో గల బెలిదిపేటలో చిన్న పాటి వర్షానికే ఆ వీధి రోడ్డు పూర్తిగా జలమయమవుతుందని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ సీజన్ లో దోమల బెడద ఎక్కువ ఉండడం వల్ల క్లోరినేషన్, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడరును వాడుతూ ఆ ప్రాంత ప్రజలను దోమల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. దీనికి కమిషనర్ స్పందించి సమస్యలు పరిష్కారానికి సంబంధిత ప్రజారోగ్య అధికారికి ఆదేశాలు జారీ చేశారు.

27న ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల సదస్సు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 27న పార్వతీపురంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలక ప్రేమానంద్ తెలిపారు. ఈ సదస్సులో జిల్లా బాడీ, రాష్ట్ర బాడీ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లాలో భవిష్యత్తు ప్రణాళిక, కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.

గిరిజన వర్సిటీ మన్యం జిల్లాలో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

సిఎం జగన్ మోహన్ ఇచ్చిన హామీ మేరకు గిరిజన యూనివర్సిటీని పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. గురువారం వారు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీ ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. యూనివర్సిటీలో 50శాతం ఉద్యోగాలు ఎస్‌టిలకు రిజర్వ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీ కోటా పెంచేలా చూడాలని కోరారు.

వాహనాలకు అనుమతి పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వాహనాలకు అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు హెచ్చరించారు. మండలంలోని ఎల్విన్‌పేట ప్రధాన రహదారి వద్ద గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి ఆంధ్రాకు, ఆంధ్రా నుంచి ఒడిశాకు రాకపోకలు సాగించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలని సూచించారు. వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించరాదన్నారు. ప్రతి ఒక్కరు వాహనాలను నడపాలని విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన సెర్ప్ ఉద్యోగులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చినమేరంగి తన అతిథి గృహంలో సెర్ప్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు ఐవి కిషోర్ ఆధ్వర్యంలో సెర్ప్ ఉద్యోగులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సెర్ప్ ఉద్యోగుల పట్ల దయ తలచి జీతాలు 23శాతం పెంచడం వల్ల ఎమ్మెల్యేను కలిసి ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపామని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో గల సెర్ప్ ఉద్యోగులు అందరూ పాల్గొన్నారు.

సిఆర్‌టిల నిరాహార దీక్షలు వాయిదా

కలెక్టరేట్: సీతంపేట ఐటిడిఎలో పని చేస్తున్న సిఆర్‌టిలందరినీ రెగ్యులర్ చేయాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నిర్వహించాల్సి ఉన్న నిరవధిక నిరాహార దీక్షలను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. రమేష్, ఎస్.మురళీ మోహన్ రావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం

ఇస్రో పంపిన చంద్రయాన్ -3 విజయవంతం పట్ల జిల్లాలో పలుచోట్ల విద్యార్థులు హర్షం ప్రకటించారు. భారతదేశం యొక్క ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప చేసిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి - కురుపాం

చంద్రయాన్ 3 విజయవంతమైన నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఉషారాణి ఆధ్వర్యంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది కలిసి శాస్త్ర వేత్తలను అభినందిస్తూ ఇస్రో ఆకారంలో తయారయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు భారతదేశం యొక్క సత్తాను చాటి విజయం సాధించినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు కళాశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో స్థానిక లయన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు 150 అడుగుల జాతీయ జెండాను, చంద్రయాన్ 3 రాకెట్ నమూనాతో జైహో భారత్, భారత్ మాతాకీ జై అంటూ ప్రపంచంలోనే భారతదేశం గుర్తింపు తెచ్చిన ఇస్రో శాస్త్రవేత్తలకు జేజేలు పలికి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ చంద్రునిపై పరిశోధనలకు చంద్రయాన్ చేసేవి ఆధునిక శాస్త్ర సాంకేతికతను మరింతగా అభివద్ధి చేయడానికి ఉపయోగపడటంలో సహకరిస్తుందనడంలో అతిశయోక్తి లేదని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు తయారు చేసిన చంద్రయాన్ 3 రాకెట్ నమూనా పలువుర్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : చంద్రయాన్ 3 విజయోత్సవం సందర్భంగా స్థానిక కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. చంద్రయాన్ 3 ప్రాజెక్టు పని చేసే తీరు, వాటి ఉపయోగాలు, భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. చంద్రుడుపై మొట్టమొదటిసారిగా భారతదేశ త్రివర్ణ పతాకం ఎగరడం గర్వకారణమని ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీ రంజని అన్నారు. కార్యక్రమంలో, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని తుమరాడలో గల శ్రీ భారతి విద్యాసంస్థల్లో టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీ నాయన సమక్షంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చంద్రయాన్ 3 సక్సెస్ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ ఇస్రో సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుని ఇటువంటి విజయాలు మరి ఎన్నో ఇస్రో శాస్త్రవేత్తలు సాధించాలని కోరారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షుడు బూరాడ రవి మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకొని ముందుకు కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి జగన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, టిడిపి నాయకులు మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: చంద్రయాన్ సక్సెస్ వేడుకల్లో పాల్గొన్న బేబినాయన

పార్వతీపురం రూరల్ : చంద్రయాన్-3 విజయోత్సవాలు పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా 100 అడుగుల జాతీయ జెండా, చంద్రయాన్-3 రాకెట్ నమూనాలను ప్రదర్శించారు. ఇస్రోకు శుభాకాంక్షలు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు.

పార్వతీపురం: ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

గుమ్మలక్ష్మీపురం : ఇస్రో ప్రవేశ పెట్టిన చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో జియమ్మవలస మండలం పెదమేరంగి జంక్షన్ తిరుమల సాయి హైస్కూల్ విద్యార్థులు త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. చంద్రయాన్-3తో భారతదేశం కీర్తి ప్రతిష్టలు ప్రపంచవ్యాప్తంగా మారు మోగాయని అన్నారు. భారత సైంటిస్టులు మేధాశక్తిని కొనియాడారు.

సీతంపేట : స్థానిక భారతి ఇంటర్నేషన్ స్కూల్లో చంద్రయాన్ విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ నవీన్ కుమార్ కేకు కట్ చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చందమామపై ల్యాండ్ అవ్వడం గొప్ప విషయమని, రానున్న రోజుల్లో మనుషులు కూడా చందమామపై అడుగుపెట్టే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీమోహన్, మురళి, సురేష్ కుమార్, దివాకర్, వెంకటేశ్వరరావు, పార్వతి, అప్పలనాయుడు, మోహన్‌రావు పాల్గొన్నారు.

పూర్ణపాడు వంతెన పూర్తి చేయాలి

ప్రజాశక్తి కొమరాడ

ప్రజలకు అవసరమైన పూర్ణ పాడు - లాబేసు వంతెనను పూర్తి చేయాలని ఎపి గిరిజన పరిరక్షణ వేదిక కన్వీనర్ కోలక లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. 8వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలకు సాధన కమిటీకి మద్దతుగా ఎపి గిరిజన పరిరక్షణ వేదిక కన్వీనర్ కోలక లక్ష్మణ మూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్.విశ్వేశ్వరరావు, కళింగ వైశ్య జిల్లా అధ్యక్షులు వడ్డి గాంధీ మద్దతుగా తెలిపారు. అనంతరం లక్ష్మణమూర్తి మాట్లాడుతూ మండలంలో 31 పంచాయతీలకు సంబంధించి అందులో 9 పంచాయతీలకు అతిముఖ్యమైన పూర్ణపాడు లాబేసు వంతెన పెండింగ్ పనులు పూర్తిచేసి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. 2006లో శంకుస్థాపన చేసినా నేటికీ వంతెన పూర్తి కాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమేనని అన్నారు. ప్రజా ప్రతినిధులు పదవులకే పరిమితం అవుతున్నారు తప్ప ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వ స్పందించి వంతెన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలో సాధన కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, బత్తిలి శ్రీనివాసరావు, పాలక నూకరాజు, పకీరు శంకర్రావు, లక్ష్మణరావు, పోలి నాయుడు, పలువురు మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజన పరిరక్షణ వేదిక నాయకులు

డీలర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం గడసింగుపురం పంచాయతీలో ఇంతవరకు రేషన్ బియ్యం ఇవ్వని డీలర్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కూరంగి సీతారాం మాట్లాడుతూ గడసింగు పురం పంచాయితీలో రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఏనుగులగూడ గిరిజనులకు ఇంత వరకూ బియ్యం ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఏనుగులగూడలోనే కాకుండా బూరి రామినాయుడువలస, గడసింగుపురం గ్రామాలకు కూడా గత రెండు నెలల నుంచి రేషన్ బియ్యం ఇవ్వలేదని అన్నారు. గిరిజనులకు సక్రమంగా రేషన్ బియ్యం ఇవ్వని డీలర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే గడసింగు పురం పంచాయితీలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు ఎం రామారావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఆహా కేంటీన్ ప్రారంభం

సాలూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం మెప్మా సహకారంతో ఏర్పాటు చేసిన ఆహా కేంటీన్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ప్రారంభించారు. పట్టణ మహిళా సమాఖ్య నుంచి రూ.13వేల ఆర్థిక సాయంతో కియోస్క్‌ను ఏర్పాటు చేశారు. బొంతలకోటి గౌరీసాయి జగన్నాధ మహిళా సంఘం సభ్యుల నిర్వహణలో కేంటీన్ నడవనుంది. కార్యాలయానికి వచ్చే ప్రజలు, సిబ్బందికి తక్కువ ధరలకు టిఫిన్, టీ సరఫరా చేయనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు హరి బాలాజీ, పి.అప్పలస్వామి, బి.శివప్రసాద్, ఇంఛార్జి కమిషనర్ సూరి నాయుడు, మెప్మా సిఎంఎం ఎ.పుష్ప పాల్గొన్నారు.

క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నారులకు ఆటల పోటీలు

పార్వతీపురం రూరల్: స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు గురువారం సిడబ్ల్యుఎస్ఎన్ కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు నిర్వహించారు. అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు ఈరోజు జిల్లా వ్యాప్తంగా పోటీలు నిర్వహించామన్నారు. వారిలో ప్రతిభ కనబర్చిన వారికి ఈ నెల 29న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని ఎంఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర శిక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగిభద్ర లో మహాశక్తి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కోసింగి భద్ర, టెంకసింగి, గుణద, మల్లుగుడ గ్రామాల్లో మహాశక్తి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా టిడిపి కురుపాం నియోజకవర్గ ఇంచార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బొద్దిడి చెక్‌డాం అభివృద్ధి చేసి కోసిందిభద్ర మీదుగా గుణద, టెంకసింగికి సాగునీరు తెచ్చిస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులు అభివృద్ధి చెందాలి అంటే చంద్రబాబు ముఖ్య మంత్రి కావాలి అన్నారు .కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వెంకటరావు, యూనిట్ ఇన్‌ఛార్జ్ బుజ్జి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, మహిళ అధ్యక్షులు నాగవేణి, కళావతి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాలు

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రకృతి సేద్య కషాయాలను తయారు చేసి తక్కువ ధరలకే రైతులకు అందించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. ఈ వనరుల కేంద్రాల్లో ద్రవ, ఘన జీవామృతం దశపత్ర కషాయం బ్రహ్మాస్త్రం, అగ్నిస్త్రం వంటి కషాయాలతో పాటుగా పంచగవ్య మీనామృతం వంటి పంటల పెరుగుదలకు ఉపయోగపడే ఉత్పత్తులతో పాటుగా జిగురు పళ్లాలు లింగాకర్షక బుట్టలు నవధాన్య విత్తనాలు కూరగాయల విత్తనాలను కూడా అందుబాటులో ఉంచడం జరుగుతుందని అన్నారు. కావాల్సిన రైతులు ఆర్‌బికెల్లో ఉన్న ప్రకృతి సేద్య ప్రతినిధులను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా పాంచాలి, రాయిగుడివలస ఆర్‌బికెల వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాలను సందర్శించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు కేవలం రసాయనాల మీద మాత్రమే ఆధారపడిపోకుండా ప్రకృతి వ్యవసాయాన్ని సాంప్రదాయ రసాయన సేద్యంతో మిలితం చేసి సాగు చేసినట్లయితే ఖర్చు తగ్గి నాణ్యమైన అధిక దిగబడులను పొందవచ్చని తెలిపారు. రైతులంతా తాము పండించే అన్ని పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని, ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పి తిరుపతి నాయుడు, విఎఎ శ్రీను, సాయి, గణేష్, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం: పొలంబడిలో మాట్లాడుతున్న ఎఒ అవినాష్

కె.వెంకటాపురంలో పొలంబడి

సీతానగరం : మండలంలోని కె.వెంకటాపురంలో వైయస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ యాంత్రీకరణ ద్వారా సాధారణ పద్ధతుల్లో వరినాట్లును పరిశీలించారు. వీటి మధ్య ఉండే తేడాను గమనించి రైతులకు వివరించారు. రెండు మీటర్లకు నుండి రెండు పాయింట్ సెంటీమీటర్ల కాలిబాటలను తీస్తే గాలి, వెలుతురు బాగా రావడంతో ఎటువంటి తెగుళ్ళ రాకుండా ఉండేందుకు ఉపయోగపడతాయ న్నారు. ఇప్పటికే తాను పరిశీలించిన పొలాల్లో అగ్గి తెగుళ్ల వచ్చినట్లు గుర్తించి వాటికి నివారణకు జీరో పాయింట్ 6 ట్రై సైక్లోజోన్ తీసుకుని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఇది సెప్టెంబర్ 15 వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బుడితి శ్రీనివాసరావు, రైతులు లంక సూర్యసుబ్రహ్మణ్యం, బుడితి ముకుందరావు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీకి మళ్లీ శంకుస్థాపన సిగ్గుచేటు

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి ప్రభుత్వం హయాంలో కొత్తవలస సమీపంలో గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన చేసిన తర్వాత మళ్లీ ఇప్పుడు సిఎం జగన్ మోహన్ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి శంకుస్థాపనకు వెళ్లడం సిగ్గు చేటని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి అన్నారు. గురువారం ఆమె అమరావతి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఒకసారి శంకుస్థాపన చేసిన పనులకు మళ్లీ మళ్లీ చేయడం వైసిపి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని చెప్పారు. నాలుగున్నర ఏళ్లలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు గురించి పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికలు దగ్గరలో ఉన్నాయని కొత్త నాటకానికి తెర లేపిందని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వం యూనివర్సిటీని కొత్తవలసలో ఏర్పాటుకు శంఖుస్థాపన చేస్తే ఇప్పుడు వైసిపి ప్రభుత్వం కూడా విజయనగరం జిల్లా లోనే శంకుస్థాపనకు సన్నాహాలు చేస్తోందని విమర్శించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని గిరిజనులను అధికారపార్టీ నాయకులు మభ్యపెడుతున్నారని అన్నారు. గడచిన నాలుగేళ్ల లో వైసిపి ప్రభుత్వ హయాంలో ఒక్క అభివృద్ధి పని కూడా పూర్తి కాలేదని చెప్పారు. శంకుస్థాపన చేసి వదిలేయడమే వారి కర్తవ్యంలా వుందన్నారు. కొటియా గ్రామాల వివాదం సుప్రీంకోర్టులో ఉండగా ఒడిశా కు చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆంధ్రా అధికారులనుద్దేశించి గో బ్యాక్ అన్నారని, అలాంటి మంత్రితో కలిసి ఇప్పుడు శంకుస్థాపన ఎలా చేస్తారని ప్రశ్నించారు. కొటియా గ్రామాలపై సుప్రీంకోర్టు స్టేటస్ కో ఉత్తర్వుల ప్రకారం ఒడిశా, ఎపి రాష్ట్రాలకు హక్కులు వున్నాయని చెప్పారు. ఆ విషయం తెలిసినా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచక్షణ కోల్పోయి గో బ్యాక్ అంటూ నోరు జారారని చెప్పారు. అలాంటి కేంద్ర మంత్రితో డిప్యూటీ సీఎం రాజన్నదొర ఎలా వేదిక పంచుకుంటారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో క్షమాపణ చెప్పించాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు.

వైసిపి నాయకుల భూముల్లో యూనివర్సిటా? : టిడిపి

పార్వతీపురంరూరల్: వైసిపి నాయకుల భూముల్లో గిరిజన యూనివర్సిటీ నిర్మాణం తగదని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ విమర్శించారు. శుక్రవారం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న గిరిజన యూనివర్సిటీ పట్ల స్థానిక టిడిపికార్యాలయంలో పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ్ చంద్రతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ నిర్మించే ప్రాంతంలో వైసిపి నాయకులకు భూములు ఉన్నాయేమోనని అనుమానం వ్యక్తం చేశారు. అందుకే లాజిస్టిక్స్ చూడకుండా అక్కడ నిర్మిస్తున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబును ఒప్పించి మన్యం జిల్లాలోని సబ్‌ప్లాన్ ఏరియాలో యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు డి.మోహనరావు, జి.రవికుమార్, కౌన్సిలర్లు బడే గౌరీనాయుడు, పి.వెంకట్రావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాయగడ జమ్ము పంచాయతీలోని పెంగవలో గురువారం జట్టు తోట జీవ, పశుసంవర్ధక శాఖ ఉమ్మడిగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. లక్ష్మణరావు మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాల అపరిశుభ్రత, వరద నీళ్లు, పచ్చిక గడ్డి పైన ఉండే కీటకాలతో కూడిన మేత తినడం వల్ల గేదెలు, మేకలు, గొర్రెలకు, పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకి అనారోగ్యాలకు గురవుతాయన్నారు. దీంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గి అంటు వ్యాధుల బారిన త్వరగా పడతాయని, చివరకు మూగజీవులు ప్రాణాలు కోల్పోతాయని తెలిపారు. వ్యాధులు, సీజనల్ వ్యాధుల విషయంలోనూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గొర్రెలకు, మేకలకు మూతి పుల్లు వ్యాధులకు టీకాలు వేశారు. చిటుకు వ్యాధికి టీకాలు వేశారు. ఆవులకు, ఎద్దులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవ కో-ఆర్డినేటర్ జి.ప్రోబోద్, జి.మురళీమోహన్, వెటర్నరీ సహాయకులు నవీన్, పి.నవీన్, టి.రామారావు, రైతులు, పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మారుమూల గిరిజన ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వైద్య శిబిరాలు నిర్వహించాలని టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి కోరారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో గిరిజనుల ఎక్కువగా బాధపడుతున్నారని తెలిపారు. స్థానికంగా వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని కోరారు.

వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

పార్వతీపురంరూరల్: మండలంలోని వెంకంపేటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా డాక్టర్ శ్రీకాంత్ వైద్య పరీక్షలు అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో 48 మందికి వైద్య పరీక్షలు అందించారు. ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో వృద్ధులు, చిన్నారులు, గర్భిణుల ఇళ్ల వద్ద వైద్య పరీక్షలు అందించామన్నారు. గ్రామంలో 66 రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

గిజబలో వైద్యశిబిరం

గరుగుబిల్లి: మండలంలోని గిజబలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంత మైంది. ఉచిత మెగావైద్య శిబిరాన్ని సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ శిరీష, డాక్టర్ రాజేష్‌తో పాటు కంటి వైద్య నిపుణులు తనిఖీలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు వంద మందికి తనిఖీలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులను అందజేశారు. ఇందులో ఆపరేషన్లకు గుర్తించిన వారిని రాగోలు జెమ్స్ హాస్పిటల్లో ఆపరేషన్లను డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్లు చేయడం జరుగుతుందని అసిస్టెంట్ మేనేజర్ పి రాజేశ్వరరావు, ఏరియా మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఉచిత మెగావైద్య శిబిరంలో ఎంపిటిసి సభ్యులు మరడాన సింహాచలం నాయుడు, మాజీ సర్పంచ్ మరడాన కృష్ణమూర్తి నాయుడు, వైసిపి మండల నాయకులు మండల శంకర్రావు, వార్డు సభ్యులు ఎం.సత్తిబాబు, పిఆర్‌ఒ అరసాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

సాలూరు: పట్టణంలో వాహనాల చోరీ కేసులో బాడంగి మండలం గొల్లాది గ్రామానికి చెందిన అప్పలనాయుడుని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు టౌన్ సిఐ సిహెచ్. శ్రీనివాసరావు చెప్పారు. ఆయన నుంచి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

అనారోగ్యంతో వాలంటీర్ మృతి

కురుపాం : మండలంలో పొడి పంచాయితీలో గల సంతోషపురం గ్రామానికి చెందిన క్లస్టర్ 5 లో పనిచేస్తున్న వాలంటీరు పువ్వల సరళ కుమారి అనారోగ్యముతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందింది. ఈమె మతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆమెకు, కుటుంబానికి మండలంలో గల వాలంటీర్లు సచివాలయం సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బస్సు ఢీకొని గాయాలు

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలోని వల్లరిగుడబకు ఉడుగు గౌరమ్మను ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గౌరమ్మ గురువారం పార్వతీపురం వెళ్లేందుకు వల్లరిగుడబ శివారులో ఉన్న బస్టాండ్ ప్రాంతానికి చేరుకుంది. అదే ప్రాంతంలో గల సాయిబాబా గుడికి దండం పెడుతుండగా, వెనుక నుండి బస్సు ఢీకొంది. దీంతో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు ప్రైవేటు వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.